కడవెండిలోని రేణుక పెదనాన్న ఇంట్లో విషాదంలో కుటుంబ సభ్యులు

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత రేణుక మృతి

- ముగిసిన ఉద్యమ ప్రస్థానం
- కడవెండిలో విషాదం

గుమ్మడవెల్లి రేణుక (ఫైల్)

దేవరుప్పుల, మార్చి 31: ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లా భైరాంఘర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాజీపూర్ బార్డర్ నెల్‌గోడా వద్ద సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మండలంలోని కడవెండికి చెందిన మావోయిస్టు నేత గుమ్మడవెల్లి రేణుక అలియాస్ భాను అలియాస్ చైతీ అలియాస్ సరస్వతి మృతి చెందారు. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రెస్ టీం ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న ఆమె పార్టీలో చురుకుగా పనిచేసేది. ఈమెపై రూ.25 లక్షల రివార్డును ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించింది. కడవెండికి చెందిన గుమ్మడవెల్లి సోమయ్య- జయమ్మ దంపతుల కూతురు రేణుక. ఆమె సోదరుడు గుమ్మడవెల్లి వెంకటకృష్ణప్రసాద్(జీవీకే ప్రసాద్) మావోయిస్టు అగ్రనేతగా పనిచేస్తుండడం, గ్రామంలో అనేక మంది పార్టీలో చేరి అగ్ర నాయకులుగా ఎదగడంతో రేణుకపై ఆ ప్రభావం పడింది. జీవీకే ప్రసాద్ మావోయిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడుగా పనిచేసి 2014లో లొంగిపోగా ప్రస్తుతం బీబీసీ (తెలుగు ఛానల్ ఇన్‌చార్జిగా) ఢిల్లీలో పనిచేస్తున్నారు. రేణుక తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువుతుండగా ఆమె మావోయిస్టు పార్టీలోకి వెళ్లింది. అలిపిరిలో చంద్రబాబు బాంబ్‌బ్లాస్ట్ ఘటన అనంతరం ఆమెపై నిర్బంధం పెరగడంతో అండర్‌గ్రౌండ్‌కు వెళ్లింది. రేణుక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతదేహాన్ని తీసుకు రావడానికి కుటుంబ సభ్యులు బయలుదేరగా, ఆమె అంత్యక్రియలు కడవెండిలో నిర్వహించేందుకు మొగ్గు చూపారని తెలిసింది. కాగా ఆమె మృతదేహం రేపు లేదా ఎల్లుండి రాగానే అంత్యక్రియల విషయం తెలుస్తుందని ఆమె పెదనాన్న లక్ష్మీనర్సయ్య తెలిపారు.

రచయితగా పేరొందిన గుమ్మడవెల్లి రేణుక

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన కడవెండికి చెందిన గుమ్మడవెల్లి రేణుక మిడ్కో పేరిట అనేక విప్లవ రచనలు చేశారు. మావోయిస్ట్ పార్టీలో అగ్రనాయకురాలిగా పనిచేస్తూ డీకేఎస్‌జడ్‌సీ ప్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న రేణుక అలియాస్ చైతూ, సరస్వతి విప్లవ రచయితగా పేరొందారు. తెలుగు సాహిత్యంలో విప్లవ కథలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ప్రముఖుల్లో ఈమె ఒకరు. ఇప్పటికే మిడ్కో కథల సంపుటి వెలువడగా, విరసం ప్రచురించిన వెయ్యొక్క కథా సంపుటిలో రేణుక కథలు అందుబాటులో ఉన్నాయి.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఏసీపీ అంబటి నర్సయ్య,

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

పాలకుర్తి, మార్చి 31: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు దోహదపడుతాయని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. సోమవారం మండలంలోని బమ్మెర బస్టాండ్ ఆవరణలో ఫ్రెండ్స్ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అంబటి నర్సయ్య మాట్లాడుతూ యువత వ్యసనాలకు లోను కాకుండా సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికిలో కీలక పాత్ర పోషించాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దూలం పవన్‌కుమార్, యూత్ సభ్యులు జంపాల రాజు, పెంతల సోమన్న, రవి, ఆశోక్, ఆశోక్, పరశురాములు, ఆశోక్, నరేశ్, ఉపేందర్, మదన్, ప్రశాంత్, సోమేశ్వర్, భుజేందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం

★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. Cont: VRN Developers & Builders-9700101918. NTW-332491

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059. NT-329891

WANTED HOSPITAL STAFF

★LAB-TECHNICIANS (Exp.) OT-TECHNICIANS, MEDICAL SHOP BOYS (Exp.) & Aayammas. Cont: Guardian Hospital, Mulugu 'x' Road, Warangal. 12 to 2 pm. NTW-496

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాలు, మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- ఈద్ ముబారక్ తెలిపిన జనగామ ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జనగామలో కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషాకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

జనగామ, (నమస్తే తెలంగాణ), జనగామ చౌరస్తా, మార్చి 31 : మనుషుల మధ్య సామరస్యాన్ని నింపే పర్వదినం రంజాన్ పండుగను సోమవారం జిల్లాలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే మసీదులు, ఈద్గాలకు వెళ్లి సామూహికంగా ప్రార్థనలు చేసి ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట రోడ్డులోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భం గా జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ముస్లిం ప్రముఖులు విందుకు ఆహ్వానించారు. గిర్నిగడ్డ, గుండ్లగడ్డ, రైల్వే స్టేషన్ ఏరియా, హైదరాబాద్ రోడ్డు, అంబేద్కర్ నగర్, మైనార్టీ కాలనీ మసీదుల వద్ద ముస్లింలు నమాజ్ చేశారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్‌తో పాటు పుర ప్రముఖులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు

నర్మెట/రఘునాథపల్లి/తరిగొప్పుల/జనగామరూరల్/జఫర్‌గఢ్/పాలకుర్తి/దేవరుప్పుల/బచ్చన్నపేట, మార్చి 31 : నర్మెటలో జరిగిన రంజాన్ వేడుకల్లో జామియా మజీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ ఆలీమొద్దీన్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, తఫ్జిల్, ఇర్ఫాన్, , గౌస్, ఖురేషి, తాహెర్ పాషా, రఫి, లల్లూ, రజాక్, ఫయాజ్, షబ్బీర్, జిలానీ, ఖాజా మియా పాల్గొన్నారు. రఘునాథపల్లి, తరిగొప్పుల మండల కేంద్రాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరు లింగం , తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అర్జుల సంపత్‌రెడ్డి, నాయకులు బీరెడ్డి జార్జిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు దామెర ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. జనగామ మండలంలోని గ్రామాల్లో మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు, జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరిగౌడ్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖరాజు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంతో పాటు తమ్మడపల్లి(జీ), సూరారం, హిమ్మత్‌నగర్, ఉప్పుగల్లు, కూనూరులో మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. పాలకుర్తిలోని ఈద్గా వద్ద ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలోని మసీదులకు ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు మంజూరు చేశానన్నారు. మత పెద్దలు ఎండీ వహీద్, సర్వర్, సలాం, ఎండీ మదార్, అబ్బాస్‌ఆలీ, ఇమామ్, సలీం, యాకూబ్, బషీర్, షరీఫ్, నజీర్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి పాల్గొన్నారు. దేవరుప్పుల మండల కేంద్రంతోపాటు కామారెడ్డి గూడెం, కాశవాడ, సీతారాంపురం, కోలుకొండ, నీర్మాల, చిన మడూరు గ్రామాల్లోని ఈద్గాల వద్ద మతగురువు ఇనాయత్ రసూల్ నేతృత్వంలో ప్రార్థనలు చేశారు. ముస్లిం కుటుంబాలు పేదలకు దానధర్మాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో గులాం రసూల్, జాకీర్‌మియా, అఫ్జల్, జబ్బార్, ఖాసీం, కోలుకొండలో ఖాసీం, యాఖూబ్ పాషా పాల్గొన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రంతోపాటు ఆలీంపూర్‌లో మాజీ ఎంపీటీసీ మసూద్, చిన్నరాంచర్లలో మాజీ సర్పంచ్ ఖలీల్ భేగం, ఎస్సై హమీద్ మసీదులో ప్రార్థనలు చేశారు.

కేసీఆర్ పాలనలోనే ముస్లింలకు పెద్దపీట : రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 31 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేళ్ల పాలనలో ముస్లింలకు పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ముస్లింలో కలిసి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాజయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏటా రాష్ట్రంలోని ముస్లింలకు రంజాన్ తోఫా (పండుగ బట్టలను) అందించారని గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని వివరించారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఖాజామొహినొద్దీన్, దస్తగిరి, గుంశావలి, రహెమతుల్లా, కమర్, యాకూబ్‌పాషా, మహిపాషా, షరీఫ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లా నిరంతరం కృషి

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తరిగొప్పుల, మార్చి 31: జనగామ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిల్ల రాజు అన్నారు. సోమవారం మండలంలోని సోలిపురంలో ఎమ్మెల్యే పల్లా ప్రత్యేక చొరవతో ఉపాధిహామీలో రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిల్ల రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి సాగునీటితో పాటు 24 గంటల కరెంట్ ఇచ్చి రైతును రాజు చేసిన ఘనత ఉద్యమ నేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సాగునీటి కొరతతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశా రు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముద్దసాని వెంకట్ రెడ్డి, వంగ రామరాజు గౌడ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పాండ్యాల రాజు, నాయకులు కావటి సురేందర్, ఎండీ యాకూబ్, ఎల్లయ్య, చెవిటి పరశురాములు, ఆవుల ఎల్లయ్య, దండం కిష్టయ్య, పెనుమల్ల వెంకటేశ్, ఉచ్చంతల కిషన్, కావటి మహేశ్, శ్రీనివాస్, చంద్ర య్య, బాపురాజు, గట్టయ్య, తాళ్లపల్లి రాజు, తిరుపతి, దండం శ్రీనివాస్, సమ్మయ్య, నవీన్, అజయ్, రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

తరిగొప్పుల, మార్చి 31: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న కొయ్యడ నరేశ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని సోమవారం స్నేహితులు పరామర్శించారు. అనంతరం మృతుడి కుమార్తె పేరున పోస్టాఫీసులో రూ.75 వేల ఫిక్స్ డిపాజిట్ చేసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంబరాజు, నాగార్జున్, శ్రీకాంత్, సురేశ్, రవి, కృష్ణ, సతీశ్, నాగపురి అనూష, భవానీ పాల్గొన్నారు.

పశుగ్రాసంగా మారిన వరి పొలాలు

- దేవాదుల నీరందక పంట నష్టం
- దుబ్బతండాలో 80 ఎకరాల్లో దెబ్బతిన్న వరితో రైతుల ఆవేదన

దుబ్బతండాలో ఎండిపోయినన పొలంలో మేస్తున్న పశువులు

దేవరుప్పుల, మార్చి 29: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో దేవాదుల ఎత్తిపోతల పథకం నుంచి జలాలందక పొలాలు ఎండిపోయాయి. దీంతో రైతులు పంటకు పెట్టిన పెట్టుబడి రాకపోగా అప్పులపాలైన దుస్థితి మండలంలోని దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాల్లో నెలకొంది. దుబ్బతండాలో యాసంగి సీజన్‌లో 120 ఎకరాల్లో నాట్లు వేశారు. గత సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా దేవాదుల ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు వస్తుందని ఆశపడ్డారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా గోదావరిలో నీరున్నా దేవాదుల రిజర్వాయర్లకు పంపింగ్ చేయకపోవడంతో రైతులు నష్టపోయారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి కాల్వ ద్వారా నీరందకపోవడంతో వేసిన వరిలో 50 శాతానికి పైగా ఎండిపోయింది. మొత్తంగా 70 ఎకరాల్లో వరి ఎండిపోయి పశుగ్రాసంగా మిగిలింది. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్ల నుంచి నీరు రాలేదు. సాగునీరు అందని ఫలితంగా పొలాలు ఎండిపోవడంతో చేసేదేమీ లేక రైతులు పశువులతో మేపుతున్నారు.

మా కంట్లె మేమే పొడుసుకున్నం..

– లకావత్ మంగ్యా, రైతు, దుబ్బ తండా

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడగొట్టి మా కంట్ల మేమే పొడుసుకున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం బాగా చేస్తుందని ప్రజలను నమ్మించిన నేతలు మోసం చేసిండ్లు. కేసీఆర్ సార్ అధికారంలో ఉన్నప్పుడు పొలాలకు మంచిగ నీళ్లు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక దేవాదుల కాల్వలకు నీళ్లు విడుదల చేయలేదు. దీంతో పొలాలు ఎండిపోయాయి. మా తండాలో 80 ఎకరాల్లో వరి ఎండిపోయింది. 60 మందికి పంట రుణం మాఫీ కాలే. ఏదో మార్పు అంటె మొగ్గు చూపి మోసపోయినం. గతంలో ఎప్పుడూ లేని విధంగా సాగు నీటి కోసం గోసపడుతున్నం. ఇప్పటికైనా దేవాదుల రిజర్వాయర్లు నింపి కాల్వల ద్వారా పంటలకు నీరందించాలి.

గుగులోత్ శంకర్ ఇంట్లో కాలిపోయిన సామగ్రి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చిల్పూరు, మార్చి 31 : మండలంలోని ఫతేపూర్‌లో గుగులోత్ శంకర్ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. బాధితుడు శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 11.30 సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు లేచాయి. దీంతో బీరువాలోని రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం, రెండు క్వింటాళ్ల బియ్యం, ఇతర సా మగ్రి కాలిపోయాయి. ప్రభుత్వం మా పరిస్థితిని పరిశీలిం చి ఆర్థికంగా సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు గుగులోత్ శంకర్ కోరాడు.

బంగారు గొలుసు చోరీ

పాలకుర్తి, మార్చి 31: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన మండలంలోని విస్నూరులో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి భూమక్క వరండాలో విశ్రాంతి తీసుకుంటుండగా గుర్తు తెలియని మహిళ వచ్చి మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లింది. బాధితురాలు భూమక్క లబోదిబోమని కేకలు వేయగా అక్కడి నుంచి పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అక్కరాజుపల్లిలో హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి

అక్కరాజుపల్లి క్రాస్ రోడ్డులో కాలిపోయిన మొక్కలు

తరిగొప్పుల, మార్చి 31: హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారిలో మండలంలోని అక్కరాజుపల్లి క్రాస్ రోడ్డు పక్కన గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటారు. అధికారులు పర్యవేక్షించకపోవడంతో అగ్నికి ఆహుతవుతున్నాయని జగన్మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో కొందరు నిప్పంటించడంతో మొక్కలు కాలిపోయాయని ఆయన తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బస్టాండ్ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

మైక్ సెట్‌ను అందిస్తున్న గంట రవీందర్

పాలకుర్తి, మార్చి 31: పాలకుర్తి బస్టాండ్ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఎస్సై మేకల లింగారెడ్డితో కలిసి ఆయన మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గతంలో కూడా బస్టాండ్‌కు బల్లలు, విద్యుత్ ట్యూబ్‌లను బహుకరించామన్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పోతు గంటి నర్సయ్య, తండా మల్లయ్య, దొపతి రాం రెడ్డి, శీల లింగయ్య, సురేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని చేరదీసిన ఆశ్రమ నిర్వాహకులు

నయీంనగర్, మార్చి 31 : ఎల్కతుర్తి రోడ్డులో ఓ వృద్ధుడు ఒంటరిగా ఉండడాన్ని గమనించిన స్థానికులు పలివేల్పుల రోడ్డులోని లార్డు ఆశ్రమ నిర్వాహకుడు నరేశ్‌కు తెలుపగా వెంటనే స్పందించిన ఆయన ఆశ్రమానికి తీసుకువచ్చారు. అతడి పేరు లక్ష్మయ్య అని మాత్రమే చెబుతున్నాడని, ఎవరైనా మతిస్థిమితం లేని వారు కనిపిస్తే తమను సంప్రదించాలని నరేశ్ కోరారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మార్చి 31 : రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకంపై జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దరఖాస్తుల స్వీకరణపై సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారితో పాటు కొత్తగా చేయాలనుకునే వారు ఆన్‌లైన్ ఫారంను డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. దీనిని ఆఫ్‌లైన్‌లో పట్టణ పరిధిలో మున్సిపల్, మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయాల్లో సంబంధిత అధికారులకు సమర్పించాలని తెలిపారు. ఈ విషయంపై యువతకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రవిందర్, ఎస్సీ, మైనార్టీ అభివృద్ధిశాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ మాధవి లత, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి, మార్చి 31: మండలంలోని ఖిలాషాపురం మల్లికార్జున స్వామి దేవాలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని నిర్వాహకులు ప్రకటించారు. అధ్యక్షుడిగా శాగ భాస్కర్, ఉపాధ్యక్షులుగా శాగ నాగయ్య, ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా శాగ ధనంజయ, రమేశ్, కమల్‌హాసన్, కోశాధికారిగా రంజిత్, కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, మహేశ్, అశోక్, మధు, సుదర్శన్, అనిల్, ప్రమోద్, అజయ్, యాదగిరిని ఎన్నుకున్నారు.

హనుమాన్ భక్తులకు అన్నదానం

గానుగుపహాడ్‌లో ముస్లిం యువకుడి దాతృత్వం

హనుమాన్ భక్తులకు భిక్ష పెడుతున్న యాకూబ్‌పాషా

జనగామ రూరల్, మార్చి 31 : మతాలు వేరైనా మానవత్వం ఒక్కటే అని చాటి చెప్పాడు ఓ ముస్లిం యువకుడు. రంజాన్ సందర్భంగా హనుమాన్ భక్తులకు భిక్ష పెట్టాలనే ఆలోచనతో అతడు అన్నదానం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా కులమతాలకు అతీతంగా అందరు కలిసి మెలసి ఉండాలనే ధ్యేయంతో హనుమాన్ భక్తులకు తన సొంత ఖర్చులతో అన్నదానం చేశారు. మతాలు వేరైనా అందరి దేవుళ్లు చూపిన మార్గమొక్కటేనని ఆయన చాటిచెప్పారు. దీంతో యాకూబ్ పాషాను గ్రామస్తులు అభినందించారు.

అనాథ వృద్ధ శరణాలయంలో..

సీతారాంపురంలో అన్నదానం చేస్తున్న ఖాజాబీ కుటుంబ సభ్యులు

దేవరుప్పుల : మండలంలోని సీతారాంపురం ప్రేమసదనం అనాథ వృద్ధ శరణాలయంలో గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు యాకూబ్ పాషా, నజీర్‌మియా కుటుంబాలు వారి తల్లి ఖాజాబీ జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం చేసి చేయూతనందించారు. ఈ కార్యక్రమంలో కు టుంబ సభ్యులు ఆసియా, హసానా, నజార్ అహ్మద్, సల్మా, యాసిన్, అస్రతజ్మీన్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

కొడకండ్ల, మార్చి 31 : ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని రంగాపురంలో జరిగింది. స్థానిక ఎస్సై చింత రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొడుగు గౌరయ్య (65) శనివారం పెన్షన్ డబ్బుల కోసం పోస్టాఫీసుకు వెళ్లాడు. అనంతరం ఇంటికి వస్తుండగా రేగుల గ్రామానికి చెందిన అశోక్ మద్యం మత్తులో ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ గౌరయ్యను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించగా, ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు గొడుగు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ట్రాక్టర్ కొనివ్వలేదనే మనస్తాపంతో ఆత్మహత్య

బోదాసి బోసు (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 31 : తల్లిదండ్రులు తనకు ట్రాక్టర్ కొనివ్వలేదనే ఆవేదనతో క్షణికావేశంతో తనయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సముద్రాలలో జరిగింది. సీఐ జీ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాలకు చెందిన బోదాసికుమార్, లక్ష్మి దంపతుల కుమారుడు బోదాసు బోసు అలియాస్ సంతోష్(20)ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తల్లిదండ్రులను ట్రాక్టర్ కొనివ్వమని అడగ్గా పైసలు లేవు, కొన్ని రోజులు ఆగమని చెప్పారు. దీంతో మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

లింగాలఘనపురంలో యువకుడు..

దుర్గాప్రసాద్ (ఫైల్)

లింగాలఘనపురం, మార్చి 31: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘనపురానికి చెందిన గాదరి దుర్గాప్రసాద్ (20) జనగామ పట్టణంలో ప్రైవేట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దుర్గాప్రసాద్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఢిల్లీ ధర్నాకు బయలుదేరిన బీసీ నాయకులు

కాజీపేట, మార్చి 31 : బీసీ ఇంటలెక్చువల్ ఫోరం బృందం ప్రతినిధులు, బీసీ సంఘాల నేతలు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 2న జరిగే ధర్నాకు కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి రైలులో సోమవారం వేర్వేరుగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ వీరస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ వేర్వేరుగా మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తూ ఇటీవల శాసనసభ బిల్లును ఆమోదించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో దేశం కోసం ప్రకాశ్, శ్రీనివాస్, రాజ్ గోవిందు, ఉపేందర్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, దాడి మల్లయ్య యాదవ్, తమ్మల శోభారాణి, బోనగాని యాదగిరి గౌడ్, భీమగాని యాదగిరి తదితరులు ఉన్నారు.